


తాళ్లపూడి తహశీల్దార్‌కు ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి - తాళ్లపూడి




తాళ్లపూడి తహశీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న టి.రాధిక ఉద్యోగోన్నతి పొందారు. ఆమెను డిప్యూటీ కలెక్టర్‌గా నియమిస్తు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో అదే స్థాయికి చెందిన జిల్లా సివిల్ సప్లయీస్ డిఎంగా ఆమె నియమితులయ్యారు. ఈ సందర్భంగా పలువురు రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ఆమెకు పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు.

ఆశల పల్లకిలో ఆశావహులు

- ప్రచారంపై వైసిపి ఇన్‌ఛార్జిల దృష్టి
- టిడిపి, జనసేనలో వీడని ఉత్కంఠ
- అంతటా ఎన్నికల వాతావరణం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లాలో ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే రాజకీయం వేడెక్కింది. ఒక వైపు ఆశావహులు మరోవైపు అధికార పార్టీ అభ్యర్థులు హోరాహోరీగా ప్రచార ఆర్భాటాలకు తెర లేపారు. ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు ఇటీవల జిల్లా యంత్రాంగం ఓటర్ల తుది జాబితాను ప్రకటించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో నియోజకవర్గాల వారీగా ఓటర్లపై స్పష్టత వచ్చేసింది. దీంతో ఆశావహులంతా అప్రమత్తం అవుతున్నారు. ఆర్థిక, సామాజిక పరిస్థితులను అంచనా వేసుకుని టిక్కెట్ల సాధనకు బలాబలాలను నిరూపించుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు. అధికార పార్టీ ఇప్పటికే నియోజకవర్గ సమన్వయకర్తల జాబితాను విడుదల చేయడంతో ఆ పార్టీలో ఒక స్పష్టత వచ్చింది. ఈ నేపథ్యంలో వివిధ రకాల పేర్లతో ప్రజల్లోకి వెళ్లి ఎన్నికల ప్రచారానికి తెరలేపారు. మరోవైపు టిడిపి, జనసేన నేతలు సైతం తామేమీ తీసికట్టు కాదంటూ కొన్ని నియోజకవర్గాల్లో ప్రచార కార్యక్రమాలు చేపడుతున్నారు. ఆ పార్టీ అధినేత చంద్రబాబు ఇటీవల మండపేటలో రా కదలిరా పేరుతో సభ నిర్వహించిన విషయం విదితమే. తాజాగా చంద్రబాబు సతీమణి భువనేశ్వరి నిజం గెలవాలి పేరుతో జిల్లాలో పర్యటించారు. దీంతో ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. అయితే ఇప్పటి వరకూ టిడిపి, జనసేన కూటమిలో ఏ అసెంబ్లీ నియోజకవర్గం ఏ పార్టీకి వెళ్తుందనే ఉత్కంఠ కొనసాగుతోంది. ఎవరికి వారే ధీమా వ్యక్తం చేస్తూ ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అనపర్తి నియోజక వర్గంలో టిడిపి నేత నల్లమిల్లి రామకృష్ణారెడ్డి గతంలో మాజీ ఎంఎల్‌ఎగానూ సేవలందించారు. తాజాగా ఈ నియోజకవర్గంలో మండపేటకు చెందిన జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి మర్రెడ్డి శ్రీనివాస్ టికెట్ ఆశిస్తున్నారు. టిడిపి జనసేన పొత్తులో భాగంగా నలమిల్లి రామకృష్ణారెడ్డితో కలిసి కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. రాజానగరం నియోజకవర్గంలో ప్రచార హోరు ఊపందుకుంది. జనసేన నియోజక వర్గ ఇన్‌ఛార్జి బత్తుల బలరామకృష్ణ జనసేన నుంచి టికెట్ ఆశిస్తున్నారు. ఈ నేపథ్యంలో గత కొన్ని నెలలుగా సేవా కార్యక్రమాలు, సంక్రాంతి ఉత్సవాలు పేరుతో ప్రజల్లోకి వెళ్లి ప్రచారం చేస్తున్నారు. ఈ నియోజక వర్గంలో అధికార పార్టీ ఎంఎల్‌ఎ, వైసిపి జిల్లా అధ్యక్షులు రాజా, సోదరుడైన జక్కంపూడి గణేష్ మండలాల వారీగా కేంద్రీకరించి ప్రజల్లో ఉంటున్నారు. ఈ నియోజక వర్గంలో టిడిపి నుంచి బొడ్డు వెంకటరమణ చౌదరి, ఎం ం ద ం ర్తి వెంకటేష్ టికెట్ ఆశిస్తున్నారనే ప్ర చా ర ం జరిగింది. అయితే పవన్‌కళ్యాణ్ ఈ నియోజకవర్గం నుంచి జనసేన బరిలో ఉంటుందని ప్రకటించడంతో జనసేన శిబిరంలో ఉత్సాహం నెలకొంది. జనసేన నుంచి టిక్కెట్‌ను ఆశిస్తున్న బత్తుల టిడిపి నాయకులను సమన్వయం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. అందులో భాగంగానే తాజాగా మాజీ ఎంఎల్‌ఎ పెందుర్తి వెంకటేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.



రాజమహేంద్రవరం నియోజక వర్గంలో వైసిపి సమన్వయ కర్త, ఎంపీ భరత్ ప్రత్యేక దృష్టి సారించారు. గుడ్ మార్నింగ్ పేరుతో రాజకీయ ప్రచారానికి తెరలేపారు. మరో వైపు అదే స్థాయిలో ఎంఎల్‌ఎ ఆదిరెడ్డి భవాని, ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్న కాంటీన్లను నిర్వహిస్తూ ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. రాజమహేంద్రవరం రూరల్‌లోనూ రాజకీయ ప్రచారం ఊపందుకుంది. వైసిపి సమన్వయ కర్త, మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ గుడ్ మార్నింగ్ పేరుతో ఇంటింటికీ పర్యటనలు చేపడుతున్నారు. ఇదే స్థానానికి టిడిపి నుంచి సిట్టింగ్ ఎంఎల్‌ఎ ఎంఎల్‌ఎ బుచ్చయ్య చౌదరి పోటీలో ఉంటానని చెబుతున్నారు. ఇదే నియోజక వర్గం నుంచి జనసేన జిల్లా అధ్యక్షులు కందుల దుర్గేష్ సైతం టిక్కెట్‌ను ఆశిస్తున్నారు. దీంతో ఎవరికివారు సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. నిడదవోలు నియోజక వర్గంలో టిడిపి నుంచి బూరుగుపల్లి శేషారావు పోటీలో ఉంటానని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రముఖ వ్యాపారవేత్త కుందుల సత్యనారాయణ అదే పార్టీ నుంచి టికెట్ ఆశిస్తున్నారు. మరోవైపు జనసేన నియోజక వర్గ ఇన్‌ఛార్జి బివిఎస్‌ఎన్ ప్రసాద్ టికెట్ కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఈ నియోజకవర్గంలో ఎంఎల్‌ఎ శ్రీనివాసనాయుడు ఇంటింటికీ ప్రభుత్వం పేరుతో ప్రచార జోరు పెంచారు.

గోపాలపురం నియోజక వర్గంలో టిడిపి నుంచి ముప్పిడి వెంకటేశ్వరరావు, మద్దిపాటి వెంకటరాజు టికెట్ ఆశిస్తున్నారు. చంద్రబాబు ఆశీస్సులు మద్దిపాటికి ఎక్కువగా ఉండటంతో ఆయనకే టిక్కెట్ ఖరారయ్యే సూచనలు కన్పిస్తున్నాయి. ఆయన పార్టీ శ్రేణులను కలుపుకోవడంపై ప్రత్యేక దృష్టి సారించారు. హోం మంత్రి తానేటి వనితకు గోపాలపురం నియోజకవర్గ సమన్వయ కర్తగా వైసిపి ప్రకటించింది. ఆమె తండ్రి బాబూజీరావు ఇప్పటికే పార్టీ శ్రేణులతో సమావేశాలను నిర్వహించి ఐక్యం చేసే పనిలో ఉన్నారు. ఈ నియోజక వర్గంలో జనసేన నియోజక వర్గ ఇన్చార్జి దొడ్డిగర్ల సువర్ణరాజు టికెట్ ఆశిస్తున్నారు.కొవ్వూరు నియోజక వర్గంలో టిడిపిలో స్తబ్ధత నెలకొంది. టిడిపి అంతర్గత విభేధాలు రోడ్డుకు ఎక్కడ ఆ పార్టీని కలవరపాటుకు గురిచేస్తుంది. ఇలా ఉంటే వైసిపి ఈ నియోజక వర్గానికి గోపాలపురం ఎంఎల్‌ఎ తలారి వెంకట్రావును ఇన్‌చార్జిగా నియమించింది. దీంతో స్థానిక నేతలను సమన్వయం చేసుకునే పనిలో ఆయన నిమగ్నవమయ్యారు. మాజీ మంత్రి జవహర్, అదే పార్టీలో మద్దిపట్ల శివరామకృష్ణ రెండు గ్రూపులుగా ఈ నియోజకవర్గంలో అధినేత ఆశీస్సుల కోసం పోటీ పడుతున్నారు.



పొగాకు తోటలో పులి పాదముద్రలను పరిశీలస్తున్న అటవీశాఖ సిబ్బంది

పులి సంచారంతో బెంబేలు

ప్రజాశక్తి- గోపాలపురం, తాళ్లపూడి

గోపాలపురం, తాళ్లపూడి మండలాల్లో పులిసంచారంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. గోపాలపురం మండలంలో జగన్నాథపురం, కరిచర్లగూడెం పరిధిలోగల మాతంగమ్మ మెట్ట మధ్యలో పులి సంచరిస్తున్నట్టు రాజమహేంద్రవరం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎల్.ధనరాజు తెలిపారు. మాతంగమ్మమెట్ట మెట్ట వద్ద పొగాకు తోటలో పులి పాదముద్రలను గుర్తించినట్లు తెలిపారు. ఈ పులి జాడను గుర్తించేందుకు అటవీ ప్రాంతంలో 20 సిసి కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ పులి కరకపాడు అటవీ ప్రాంతం ద్వారా పాపికొండల అభయారణ్యంలోకి వెళ్లే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. చుట్టుపక్కల గ్రామల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. జగన్నాథపురం, కరిచర్లగూడెం, కోమటికుంట పరిధిలో రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది మైకు ద్వారా ప్రచారం చేస్తున్నారు. ఏలూరు, జంగారెడ్డిగూడెం సబ్ డిఎఫ్ఒలు, పోలవరం రేంజ్ ఆఫీసర్ దావీదురాజు, వేణుగోపాల్, ఎఫ్‌బిఒ కార్తిక్ , శ్రీను, శ్రీశైలం టైగర్ టీమ్ సభ్యులు పులి తిరిగిన ప్రదేశాలను పరిశీలిస్తున్నారు. సోషల్ మీడియా, వాట్సప్‌ల్లో కొంత మంది వీడియోలు పెట్టి అసత్య ప్రచారాలు చేస్తున్నారని ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నార్నారు. వాటిని నమ్మొద్దని అసత్య ప్రచారాలు చేసేవారిపై చర్యలు తీసుకుంటామని ఫారెస్ట్ అధికారులు తెలిపారు. తాళ్లపూడి మండలంలో తాడిపూడి ఇసుక రీచ్ వద్ద పనిచేసే కార్మికులు గురువారం సాయంత్రం పులిని గుర్తించారు. ఇసుకర్యాంపులో పులి నడిచి వెళ్లడం గుర్తించి పక్కనే గల చిన్న గదిలోకి పరుగులు తీసి ప్రాణాలు దక్కించుకున్నారు. పులి సంచరిస్తున్న ప్రదేశాన్ని వీడియో లో బంధించారు. ఇది తాడిపూడి నుండి తాళ్లపూడి వైపుగా వెళుతున్నట్లు కనబడుతోంది.

'ఆడుదాం ఆంధ్రా'తో క్రీడాస్ఫూర్తి

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

క్రీడాకారులు ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా ఆడగలమనే క్రీడా స్ఫూర్తిని 'ఆడుదాం ఆంధ్రా'క్రమం ద్వారా ముఖ్యమంత్రి జగన్ తీసుకొచ్చారన్నా మంత్రి చెల్లుబోయిన శ్రీనివాసవేణుగోపాలకృష్ణ పేర్కొన్నారు. గురువారం ఎంపిడిఒ కార్యాలయం ఆవరణలో రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం 'ఆడుదాం ఆంధ్ర' క్రీడల్లో విజేతలకు బహుమతుల ప్రదానం కార్యక్రమానికి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి వేణు పాల్గొన్నారు. విజేదలకు ట్రోఫీ, నగదు పురస్కారాలు అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్, రూరల్ పరిశీలకులు పికె.రావు, బొమ్మూరు మాజీ సర్పంచ్ మద్దిపాటి శంబాజీరావు, గిరిజన సంక్షేమ, మండల ప్రత్యేక అధికారి కెఎన్.జ్యోతి, ఎంపిడిఒ డి.శ్రీనివాసరావు, ఎంఇఒ తులసీదాస్, స్థానిక నాయకులు బొప్పన సుబ్బారావు, పసలపూడి శ్రీనివాసరావు, వెయ్యల రాజేష్, సచివాల కార్యదర్శులు పాల్గొన్నారు.



రహదారిపై ప్రమాదకరంగా మారిన గొయ్యి

మంత్రి సారూ... ఇలా చూడండయ్యా..!

ప్రజాశక్తి - కడియం

మంత్రి సారూ... మీరైనా ఈ రోడ్డును పట్టించుకోండయ్యా.. అంటూ వేడుకుంటున్నారు మండలానికి చెందిన ప్రజలు. ధవళేశ్వరం నుంచి సామర్లకోటకు వెళ్లే ప్రధాన రహదారి (కెనాల్ రోడ్డు)లో వేమగిరి జాతీయ రహదారి కూడలికి కూత వేటు దూరంలో పెద్ద గుంత ఏర్పడి ప్రమాదాలకు నిలయంగా మారింది. ఇక్కడ తరచూ పలు ప్రమాదాలు జరుగుతున్నా... ప్రయాణికులు కాళ్లు, చేతులు విరుగుతున్నా, తలలు పగులుతున్నా ప్రజాప్రతినిధులు గాని, ప్రభుత్వ అధికారులు గానీ పట్టించుకున్న దాఖలాలు లేవు. గతంలో ఒక ద్విచక్ర వాహన దారుడు ఈ గుంతలో పడి తలకు తీవ్ర గాయమై ఘటనా స్థలం లోనే మృతి చెందినట్లు స్థానికులు చెబుతున్నారు. అప్పటి వైసిపి రూరల్ కో-ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ తన స్వీయ నిధులు వెచ్చించి తాత్కాలిక మరమ్మతులు చేపట్టారని తెలిపారు. ప్రస్తుతం మళ్లీ పరిస్థితి యథాస్థితికి వచ్చిందని వాపోతున్నారు. రూరల్ మండలానికి మంత్రి వేణు ఇన్‌ఛార్జిగా రావడంతో ఆయనైనా పట్టించుకుని ఈ సమస్యను పరిష్కరించాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.

'ఆసరా'తో మహిళలకు ఆర్థిక భరోసా

ప్రజాశక్తి - గోపాలపురం, దేవరపల్లి, తాళ్లపూడి

ఆసరా పథకంతో మహిళలకు ఆర్థిక భరోసాను ముఖ్యమంత్రి జగన్ కల్పిస్తున్నారని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. గురువారం మార్కెట్ యార్డ్ ఆవరణలో వైఎస్ఆర్ ఆసరా 4వ విడత కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మహిళా సాధికారతకు ఆసరా ఎంతో దోహదపడుతుందన్నారు. గోపాలపురంలో 12,467 స్వయం సహాయ సంఘాలకు రూ.10.08 లక్షలను ఆసరాలో భాగంగా అందించామన్నారు. వైఎస్ఆర్ ఆసరా పథకం ద్వారా ఆర్థిక చేయూతను అందించడమే కాకుండా పలు బహుళజాతి సంస్థల ద్వారా వ్యాపారాలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్థిక పరమైన కష్టాలున్నా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను క్రమం తప్పకుండా అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ ఎన్‌వివిఎస్.మూర్తి, డిపిఎం హేమంత్, ఎపిఎం ఇ.శ్రీనివాసబాబు, సిసిలు సుజిని, రసూల్, వెంకటలక్ష్మి, ఎంపిపి ఉండవల్లి సత్యనారాయణ, జడ్‌పిటిసి సభ్యులు కె.లలిత, వైస్ ఎంపిపిలు బి.వెంకటేశ్వరమ్మ, వంగ నారాయణమ్మ, సర్పంచులు యండపల్లి శేఖర్ బాబు, కురుకూరి ధనలక్ష్మి, అన్నెపు వెంకటలక్ష్మి, పైడి శిరీష, మడిచర్ల ప్రసాద్, మండల సమాఖ్య అధ్యక్షులు వింత శ్రావణి, సొసైటీ అధ్యక్షులు కూసం రామ్మోహన్ రెడ్డి, ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యక్షులు వెలగా శ్రీరామమూర్తి, ఎఎంసి చైర్మన్ గన్నమని జనార్థన్ తదితరులు పాల్గొన్నారు.



ఆసరా చెక్కులను పంపిణీ చేస్తున్న ఎంఎల్‌ఎ తలారి

మహిళా సాధికారతకు పెద్దపీట

దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో సిఎం జగన్ మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తున్నారని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. గురువారం గోపాలపురం, దేవరపల్లి మండలాల ఆసరా 4వ విడత సంబరాల కార్యక్రమం దేవరపల్లి అంబటి సత్యనారాయణ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి వనిత మాట్లాతూ గోపాలపురం మండలంలో 1,267 గ్రూప్‌లకుగాను 12,467 మంది డ్వాక్రా మహిళలకు రూ.10.08 కోట్లు, దేవరపల్లి మండలంలో 1,663 గ్రూప్‌ల్లో 16,630 మంది డ్వాక్రా మహిళలకు రూ.15.33 కోట్లను పంపిణీ చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో పలు సంక్షేమ పథకాలను జగన్ అమలు చేస్తున్నారన్నారు. మహిళా సాధికారతకు కషి చేస్తున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉందన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలతో రాష్ట్రంలో పేదరికం 12 శాతం నుంచి ఆరు శాతానికి తగ్గిందన్నారు. రాబోయే రోజుల్లో వైసిపికి మరోమారు పట్టం కట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ గన్నమని జనార్ధన్‌రావు, దేవరపల్లి, గోపాలపురం ఎంపిపిలు కెవికె.దుర్గారావు, ఉండవల్లి సత్యనారాయణ, సర్పంచ్ కడిమి వీరకుమారి, మండల అధ్యక్షుడు కూచిపూడి సతీష్, నరహరిశెట్టి రాజేంద్ర బాబు, జిల్లా అధికార ప్రతినిధి గడ జగదీష్, కుసులూరి సతీష్, ఎంపిటిసి సభ్యులు సత్తి జగదీశ్వర్‌రెడ్డి, సత్తి సాయిఈశ్వర్‌రెడ్డి, బిసి మహిళా అధ్యక్షులు కడలి హైమావతి, అధికారులు పాల్గొన్నారు.



ఆసరా చెక్కులను అందిస్తున్న మంత్రి తానేటి వనిత

జగన్‌ను మళ్లీ సిఎంను చేయాలి : తలారి

అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తూ పేదలకు చేయూతగా ఉన్న జగన్‌ను మరోసారి సిఎం చేయాలని ఎంఎల్‌ఎ తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని బల్లిపాడు-వేగేశ్వరపురం రోడ్డులోని డివివి.దానయ్య ఎస్టేట్‌లో గురువారం జరిగిన జగనన్న ఆసరా కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మహిళలకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కొవ్వూరు నియోజకవర్గంలో ఆసరాలో భాగంగా రూ.43.47 కోట్లను అందిస్తున్నామన్నారు. తాళ్లపూడి మండలంలో రూ.10.87 కోట్ల మేర మహిళలకు లబ్ధి చేకూరుతుందన్నారు. ఇచ్చిన హామీ మేరకు నాలుగు విడతలుగా జగనన్న ఆసరా చెక్కులు అందించిన ఘనత జగన్‌కే దక్కిందన్నారు. ఎంపిపి జొన్నకూటి పోసిరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జడ్‌పి వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, వైసిపి మండల అధ్యక్షులు కాకర్ల వెంకటేశ్వరరావు, నాయకులు పోసిన శ్రీకృష్ణదేవరాయలు, వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

శిరోముండనం నిందితుల క్వాష్ పిటిషన్ కొట్టివేత

ప్రజాశక్తి - సీతానగరం

తూర్పుగోదావరిజిల్లా సీతానగరం మండలం మునికూడలిలో ఇసుక అక్రమ రవాణా అడ్డుకున్నాడనే నెపంతో అధికార వైసిపి నాయకులు పోలీస్ స్టేషన్లోనే దళిత యువకుడికి శిరోమండనం చేశారు. ఈ ఘటనకు సంబంధించి నిందితులు వేసిన క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టి వేసింది. శిరోముండనం బాధితునికి పలు దళిత సంఘాలు అండగా నిలిచాయి. కోర్టును ఆశ్రయించాయి. విచారణ జరపకుండా 2020లో హైకోర్టు స్టే ఇచ్చింది. నాలుగేళ్ల అనంతరం నిందితులు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్ కొట్టి వేస్తూ తీర్పు ఇచ్చింది. ఈ కేసులో వరప్రసాద్ తరఫున ప్రముఖ న్యాయవాది జడ శ్రావణ్‌కుమార్ వాదనలు వినిపించారు. ఇసుక అక్రమ రవాణా అడ్డుకున్నారనే నెపంతో వరప్రసాద్‌ను కులం పేరుతో దూషించి, రాజకీయ నాయకులు అండదండలతో పోలీస్ స్టేషన్‌లోనే శిరోముండనం చేయించిన నిందితులకు చట్ట ప్రకారం శిక్ష విధించాలని న్యాయవాది శ్రవణ్ కుమార్ న్యాయస్థానాన్ని కోరారు. అంతే కాకుండా విచారణ పూర్తి కాకుండా నిందితులు వేసిన క్వాష్ పిటిషన్‌ను డిస్మిస్ చేయాలని కోరారు. శ్రవణ్ కుమార్ వాదనలతో ఏకీభవించిన రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం నిందితులపై క్వాష్ పిటిషన్ కొట్టి వేసింది. కేసులో విచారణ కొనసాగించాలని పోలీసులకు ఆదేశాలించింది. శిరోముండనం బాధితుడు వరప్రసాద్ మాట్లాడుతూ న్యాయస్థానంలో న్యాయం బతికే ఉందని మరోసారి రుజువైందన్నారు.



జవహర్‌కు వ్యతిరేకంగా పక్లకార్డులతో నిరసన తెలుపుతున్న నాయకులు, కార్యకర్తలు

'జవహర్ వద్దు... టిడిపి ముద్దు'

ప్రజాశక్తి - తాళ్లపూడి, చాగల్లు

జవహర్ వద్దు టిడిపి ముద్దు నినాదంతో మండలంలోని టిడిపి యువగళం నాయకులు గురువారం రెండు బస్సుల్లో నియోజకవర్గ కేంద్రం కొవ్వూరుకు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా జిల్లా యువగళం నాయకులు కాకర్ల సత్యేంద్ర తాళ్లపూడి బస్టాండ్ సెంటర్లో మాట్లాడారు. మాజీ మంత్రి కెఎస్.జవహర్ పార్టీలో నాయకులు, కార్యకర్తల మధ్య విభేదాలు సష్టిస్తూ కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఈ కారణంగా 2019లో జవహర్ ఓడిపోయారన్నారు. ప్రస్తుతం ఆయన పార్టీ కోసం పని చేసే వారిని పట్టించుకోకుండా వేరే వారికి పదవులు కట్టబెట్టి విభేదాలు సష్టిస్తున్నారన్నారు. ఎన్నికలకు కొవ్వూరు అసెంబ్లీ స్థానం నుంచి టికెట్ జవహర్‌కు కాకుండా మరొకరికి ఇవ్వాలన్నారు.

చాగల్లు మండలంలోని టిడిపి నాయకులు గురువారం మధ్యాహ్నం టిడిపి సీనియర్ నాయకులు ఆళ్ల హరిబాబు, నాదాల శ్రీరామ్‌చౌదరి, పట్టణ అధ్యక్షులు దొంగ రామకృష్ణ ఆధ్వర్యంలో చాగల్లు మండలం నుంచి కొవ్వూరుకు పయనమయ్యారు. బైకులు, కార్లపై వారు ర్యాలీగా కొవ్వూరుకు వెళ్లారు.

రాష్ట్రంలో నిరంకుశ పాలన

ప్రజాశక్తి - గోపాలపురం

రాష్ట్రంలో నిరంకుశ పాలన కొనసాగుతుందని, సామాన్య జనంతో పాటు అంగన్‌వాడీలు వంటి చిరు ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి దొడ్డికర్ల సువర్ణరాజు అన్నారు. గురువారం హుకుంపేట గ్రామ జనసేన కమిటీ ప్రెసిడెంట్ గేరా ఫణింద్ర ఆధ్వర్యంలో సువర్ణరాజు, ఆ పార్టీ నాయకులు ప్రముఖ విద్యావేత్త, టిడిపి సీనియర్ నాయకులు హోతా రాజబాబును మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనతో జనసేన క్యాలెండరు ఆవిష్కరణ చేయించారు. అనంతరం ప్రస్తుతం రాష్ట్రంలో విషయాలను చర్చించారు. రాష్ట్రంలో సాగుతున్న వైసిపి అరాచకపాలనకు సంబంధించిన పలు విషయాలను ఆయన దృష్టికి నాయకులు ఈ సర,ర్భంగా ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పోసిన గణపతి, సూర్యభగవాన్, సత్యనారాయణ, మల్లీశ్వరావు, రాంబాబు, రాజకుమార్, ఫణింద్ర, నాగు, సురేంద్ర, సుబ్రహ్మణ్యం, జయపాల్, బాలు, శ్రీనివాస్, నాయుడు, టిడిపి నాయకులు నాగేశ్వరావు, మంగపతి రాజు, కర్రీ రాము, సర్పంచ్ దాకే గోపి తదితరులున్నారు.

కార్టూ'నిజం'



ఈ రికార్డును మాత్రం భవిష్యత్‌లో ఏ సర్కారూ బ్రేక్ చేయలేదేమో సార్..!!!

మహిళా సంక్షేమమే టిడిపి ధ్యేయం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

మహిళా సంక్షేమమే టిడిపి ధ్యేయమని ఆ పార్టీ నేతలు అన్నారు. స్థానిక తాడితోటలోని రవణం శ్రీరాములు కల్యాణ మండపంలో టిడిపి నగర మహిళ కమిటీ, టిడిపి నగర అంగన్‌వాడీ కమిటీల ప్రమాణ స్వీకారం ఆ పార్టీ రాజమండ్రి పార్లమెంట్ కమిటీ అధ్యక్షులు మాలే విజయలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఎంఎల్‌సి ఆదిరెడ్డి అప్పారావు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్, టిడిఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వర్రే శ్రీనివాస్, బిసి సీనియర్ నాయకులు రెడ్డి రాజు, ఛాంబర్ మాజీ అధ్యక్షులు దొండపాటి సత్యంబాబు, రాజమండ్రి పార్లమెంట్ కమిటీ ఉపాధ్యక్షులు మజ్జి రాంబాబు, టిడిపి నగర అధ్యక్షులు రెడ్డి మణేశ్వరరావు, నగర మహిళ కమిటీ అధ్యక్షురాలు కోసూరి చండిప్రియ, నగర అంగన్వాడీ కమిటీ అధ్యక్షురాలు బోను ఈశ్వరి తదితరులు పాల్గొని మాట్లాడారు. సమాజంలో మహిళలు శక్తివంతులుగా ఎదగడానికి ఎనలేని కృషి చేశారన్నారు. మహిళా సాధికారతకు నిలువెత్తు రూపం టిడిపియేనన్నారు. తొలుత తెలుగు మహిళలు ర్యాలీగా కల్యాణ మండపం చేరుకున్నారు. ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నగర ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధా, ఉపాధ్యక్షులు ఉప్పులూరి జానకి రామయ్య, కార్యనిర్వాహక కార్యదర్శి ద్వారా పార్వతి సుందరి పాల్గొన్నారు.



ప్రమాణస్వీకారం చేస్తున్న తెలుగు మహిళలు

ఎన్‌ఎస్‌ఎస్ నేషనల్ క్యాంప్‌నకు విజేస్ విద్యార్థి భరద్వాజ్ ఎంపిక

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం

పంజాబ్‌లోని చిత్కారా యూనివర్శిటీలో ఈ నెల 5 నుంచి 11వరకూ జరిగే ఎన్‌ఎస్‌ఎస్ జాతీయ శిబిరానికి విజేస్ ఫార్మా కళాశాల విద్యార్థి దవరసింగి భరద్వాజ్ ఎంపికయ్యాడని ప్రిన్సిపల్ నరేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా భరద్వాజ్‌ను కళాశాల సెక్రటరీ, కరస్పాం డెంట్ డాక్టర్ ఎన్‌విపి.జగన్మోహన్‌రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ డి.నరేంద్ర, కళాశాల చైర్‌పర్సన్ ఎన్.శకుంతల అభినందించారు. ఆంధ్ర యూనివర్సిటీ పరిధిలో ఎన్‌ఎస్‌ఎస్ నేషనల్ శిబిరానికి ఫార్మా, ఇంజినీరింగ్ కళాశాలలలో చదువుతున్న పది మంది విద్యార్థులు ఈ శిబిరానికి వెళున్నారని చెప్పారు. ఈ మేరకు గురువారం ఎయు విసి పివిజిడి.ప్రసాద్‌రెడ్డిని ఎన్‌ఎస్‌ఎస్ జాతీయ శిబిరానికి వెళ్తున్న బృందం కలిసింది. విసి ఆయనకు పలు సూచలను చేశారని ప్రిన్సిపల్ నరేంద్ర తెలిపారు.



పంజాబ్ వెళ్లనున్న ఎన్‌ఎస్‌ఎస్ బృందం

నేరాలు ఘోరాలు


వివరాలను వెల్లడిస్తున్న డిఎస్‌పి కిషోర్‌కుమార్

దాడి ఘటనలో ముగ్గురికి రిమాండ్

ప్రజాశక్తి- గోకవరం

గోకవరం లక్ష్మీ కళ్యాణ ఫ్యామిలీ రెస్టారెంట్‌లో వెయిటర్‌పై దాడి ఘటనలో రొంగలి ఈశ్వరవీరగణేష్, పోసిన వీరభార్గవ్, తోట దీపక్‌లపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని నార్త్‌జోన్ ఇన్‌ఛార్జి డిఎస్‌పి కిషోర్‌కుమార్ తెలిపారు. గురువారం గోకవరం పోలీస్ స్టేషన్ వద్ద నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన ఈ వివరాలు వెల్లడించారు. రెస్టారెంట్ వద్ద బుధవారం సాయంత్రం బిర్యానీ కోసం ముగ్గు వ్యక్తులు వెళ్లారు. రెస్టారెంట్ వెయిటర్ పులపర్తి రాజు ఒక బిర్యానీ రూ.200 అని వారికి తెలిపాడు. బిర్యానీ రూ.150 అంటూ వారు వెయిటర రాజుపై వాగ్వాదానికి దిగారు. పక్కనే ఉన్న గాజు డ్రింక్ బాటిల్‌ను పగులగొట్టి రాజుపై దాడి చేశారు. తీవ్ర గాయాలైన రాజు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రి సిబ్బంది నుంచి సమాచారం అందుకున్న గోకవరం పోలీసులు వెంటనే స్పందించారు. ఈ కేసులో ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపామని డిఎస్‌పి తెలిపారు. వివిధ పత్రికల్లో బ్లేడ్ బ్యాచ్ దాడి చేసిందటూ వచ్చిన వార్తలను ఆయన ఖండించారు. ఇవి పూర్తిగా అవాస్తమని తెలిపారు. రెస్టారెంట్ సిబ్బందికి, నిందితులకు గతంలో కూడా ఎప్పుడూ పరిచయాలు లేనట్లుగా తమ విచారణలో తేలిందన్నారు. ఈ ఘటన అప్పటికప్పుడు జరిగిందన్నారు. పత్రికల్లో రాసే ముందు పోలీసుల నుంచి పూర్తి సమాచారం తీసుకుని రాయాలని సూచించారు. ఈ సమావేశంలో కోరుకొండ సిఐ నాగమురళి, గోకవరం ఎస్ఐ నాగరాజు పాల్గొన్నారు.

రైటప్: 1 పత్రికా సమావేశంలో మాట్లాడుతున్న ఇన్చార్జి డిఎస్ పి కిషోర్ కుమార్.


ఘటనా స్థలంలో తండ్రీకొడుకుల మృతదేహాలు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

ప్రజాశక్తి-కొత్తపేట

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మతి చెందిన సంఘటన చోటుచేసుకున్నట్లు కొత్తపేట ఎస్ఐ డి.జ్వాలా సాగర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. రావులపాలెం మండలం ముమ్మిడివరప్పాడు గ్రామానికి చెందిన చీమల మాధవరావు తన తండ్రి నరసింహారావు కలిసి తన ద్విచక్ర వాహనంపై వాడపాలెం గ్రామంలో తన బంధువుల ఇంటికి వచ్చారు. వారు తిరిగి తన ఇంటికి వెళ్తుండగా పశ్చిమగోదావరి జిల్లా ఆచంట మండలానికి చెందిన ఆటో డ్రైవర్ బండి మోషే తన ఆటోతో పలివెల వైపు వస్తుండగా మార్గమధ్యలో చౌదరిపురం సత్తెమ్మ తల్లి గుడి సమీపంలో ఎదురెదురుగా వచ్చి ఢీకొంది. దీంతో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న మాధవరావు(43)ఆటోపై వస్తున్న మోషే(35) ఇద్దరూ సంఘటన స్థలంలోనే మతి చెందారు. నరసింహారావుకు బలమైన గాయాలు తగలడంతో మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. సంఘటన ప్రాంతాన్ని ఎస్ఐ పరిశీలించి మృతదేహాలను పంచనామా నిమిత్తం కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై మృతుల కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పేకాడుతున్న ఆరుగురిపై కేసు

ప్రజాశక్తి - కడియం

మండలంలోని కడియపులంక శివారు దోసాలమ్మ కాలనీ సమీపాన గల ప్రసన్న రాజ్‌కుమార్ నర్సరీలో గురువారం పేకాట శిబిరంపై దాడి చేసి ముగ్గురిని అరెస్టు చేశామని కడియం సిఐ బి.తులసీధర్ తెలిపారు. అలాగే మరో ముగ్గురు తప్పించుకుని పారిపోయారన్నారు. మొత్తం ఆరుగురిపై కేసు నమోదు చేసి నట్లు తెలిపారు. నిందితుల నుంచి రూ.14,600 నగదు, నాలుగు సెల్ ఫోన్లు, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐ మహ్మద్ అశ్రఫ్, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

అవనికుమారి సేవలు ఆదర్శనీయం

ప్రజాశక్తి- కడియం


అవనికుమారిని సత్కరిస్తున్న సిబ్బంది

అంకితభావంతో పనిచేస్తూ ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్దిన అవని కుమారి సేవలు ఉపాధ్యాయులు అందరికీ ఆదర్శనీయమని ఎంఇఒ వి.లజపతిరాయ్, కడియపులంక సర్పంచ్ పాటంశెట్టి రాంజీ అన్నారు. బుర్రిలంక ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయునిగా చేస్తూ ఉద్యోగ విరమణ పొందిన కె.అవనికుమారిని గురువారం పాఠశాలలో ఘనంగా సత్కరించారు. హెచ్ఎం భాస్కర్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో లజపతిరాయ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలో ఉపాధ్యాయులు, పలువురు ప్రజా ప్రతినిధులు, స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు అవని కుమారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కోశాధికారి ఇవిఎస ఆర్.ప్రసాద్, ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు లక్ష్మణరావు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత చిలుకూరి శ్రీనివాసరావు, వివిధ సంఘాల ఉపాధ్యాయ నేతలు అబ్బాయి, శాస్త్రి, ఎస్.శ్రీనివాసరావు, ఉంగరాల వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిని పగడ్బందీగా అమలు చేయాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు



సమావేశంలో మాట్లాడుతున్న కెఎస్.శ్రీనివాస్

ఉపాధి హామీ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. ప్రజాసంఘాల భవనంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు టేకుమూడి ఈశ్వరరావు అధ్యక్షతన గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి కెఎస్.శ్రీనివాస్ మాట్లాడారు. కేంద్రంలో బిజెపి రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తోందన్నారు. కేంద్ర బడ్జెట్‌లో రూ.30 వేల కోట్లు కోత పెట్టి కూలీల పొట్ట కొట్టిందన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం, వామపక్ష పార్టీల పోరాటాల ఫలితంగా వచ్చిన ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఉపాధి నిధుల ద్వారా మాత్రమే రాష్ట్రంలో పలు అభివృద్ధి పనులు జరిగాయని గుర్తు చేశారు. రాష్ట్రంలో ఉపాధి పనులు ఎక్కువ చేస్తేనే నిధులు అదే విధంగా వస్తాయన్నారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేసి ఉపాధి హామీ నిధులు సాధించుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా కూలీలకు పనులు కల్పించకపోతే ఉపాధి కూలీలు వలస బాట బాట పట్టే అవకాశం ఉందన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే ఫిబ్రవరి, మార్చ్ నెలల్లో కూలీలు వలస పోవాల్సి వస్తుందని తెలిపారు. చదువుకున్న మహిళలను మేట్లగా నియమించి వారికి పారితోసికం ఇవ్వలేదని, సెల్ ఫోన్లు ఇచ్చి రీఛార్జి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు దుప్పి అదృష్టదీపుడు, మందనక్క తణుకు రాజు, నేరేడుమిల్లి త్రిమూర్తులు, దానం మాలయ్య, దండాల అబ్బులు, అనసూయ, వెంకటలక్ష్మి, శైలజ, ఎం.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌తో ఎలుకల నిర్మూలన తగదు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

వరి చేలలో ఎలుకల నిర్మూలనకు విద్యుత్ వినియోగించరాదని విద్యుత్‌శాఖ ఎఇ నిడదవోలు దొరబాబు హెచ్చరించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని కొన్ని గ్రామాల్లో రైతులు వరి చేలల్లో ఎలుకలను నిర్మూలించేందుకు రంగు బల్బులతో కూడిన విద్యుత్ తీగలను, బల్బులు లేకుండా తీగలను ఏర్పాటు చేస్తున్నారని, ఇది చట్ట విరుద్ధమని, అలాంటి వారిపై క్రిమినల్ కేసులు పెడతామని స్పష్టం చేశారు. వ్యవసాయ అధికారి సూచనల మేరకు ఎలుకల నిర్మూలన మందు తప్ప విద్యుత్‌కు సంబంధించిన పరికరాలు ఉపయోగించరాదన్నారు ఆయన వెంట ఎల్ఐ సుమన్, లైన్‌మేన్లు ఉన్నారు.

స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలి

ప్రజాశక్తి - కడియం

నేటి యువత స్వశక్తితో స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలని రాజమహేంద్రవరం రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్యచౌదరి సూచించారు. కడియం బస్టాండ్ సెంటర్లో దుప్పలపూడి రామకృష్ణ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన టీ టైం స్టాల్‌ను ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్‌తో కలిసి ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా టీ టైం సంస్థల డైరెక్టర్ తంగెళ్ల సురేష్ మాట్లాడారు. భవిష్యత్ తరాలకు అనుగుణంగా కోటి ఆశలతో నేటి యువత స్వయం ఉపాధి వైపు అడుగులు వేస్తూ ముందుకు సాగడం శుభ పరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో కడియపు సావరం సర్పంచ్ చెక్కపల్లి మురళీకృష్ణ, శీలం రవి, అనసూరి గోవిందు తదితరులు పాల్గొన్నారు

ముఖ్య నాయకులను విస్మరించడం తగదు

ప్రజాశక్తి -గోకవరం

ఇటీవల వైసిపి జగ్గంపేట నియోజకవర్గం ఇన్‌ఛార్జిగా నియమితులైన తోట నరసింహం నియోజవర్గంలో వైసిపి ప్రజా ప్రతినిధులను, ముఖ్యనాయకులను కలుపుకుపోకుండా, ప్రోటోకాల్ లేని వ్యక్తులను కలుపుకుంటూ వారికి ప్రాధాన్యత ఇస్తున్నారని వైసిపి నాయకులు దాసరి రమేష్ విమర్శించారు. గురువారం గోకవరంలో దాసరి రమేష్ నివాసం వద్ద నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. తోట నరసింహం తమను ఎలాంటి కార్యక్రమాలకు ఆహ్వానించట్లేదన్నారు. అందర్నీ కలుపుకుపోతేనే పార్టీకి మరింత బలం చేకూరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట నియోజకవర్గ నాలుగు మండలాల వైసిపి నాయకులు పాల్గొన్నారు.

సీతానగరం ఎంపిడిఒగా కృష్ణప్రసాద్

ప్రజాశక్తి - సీతానగరం

సీతానగరం ఎంపిడిఒగా కెఆర్ఎస్.కృష్ణప్రసాద్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఎంపిపి గుర్రాల జ్యోత్స్న, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది కృష్ణప్రసాద్‌కు పుష్పగుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. కృష్ణప్రసాద్ ఏలూరు జిల్లా జీలుగుమిల్లు నుంచి బదిలీపై సీతానగరం వచ్చారు.

యానాం వార్తలు


సమావేశంలో పాల్గొన్న వివిధ రాజకీయ పార్టీల నాయకులు

నష్ట పరిహారం కోసం ఐక్య పోరాటం

ప్రజాశక్తి - యానాం

ఎఎన్జిసి చమురు సంస్థ నుండి మత్స్యకారులకు రావలసిన వేట నష్టపరిహారం తక్షణమే అన్ని పార్టీలు కలిసి పోరాడుతామని అఖిలపక్ష సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు ఆయా పార్టీల ప్రతినిధులు తెలిపారు. గురువారం స్థానిక గాజుల వీధిలో ఉన్న పార్వతీశ్వరమ్మ మినీ ఫంక్షన్ హాల్లో జరిగిన సమావేశంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు రాజకీయ పార్టీల నాయకులు మాట్లాడుతూ మత్స్యకార కుటుంబాలు చేపల వేట జీవనాధారంగా జీవిస్తున్నారని చేపల వేటకు వెళ్లకుండా ఉండడానికి ఒఎన్జిసి చమురు సంస్థ నష్టపరిహారం ఇవ్వాల్సి ఉండగా నష్టపరిహారం ఇవ్వకుండ కాలయాపన చేయడాన్ని వారు ఖండించారు. సుమారు రూ.23 కోట్ల నష్టపరిహారం ఉపాధి కోల్పోయిన బాధితులు మత్స్యకారులకు అందించడంలో పుదుచ్చేరి ప్రభుత్వం విఫలమైందని వారు తెలిపారు. స్థానిక అధికారులు నిర్లక్ష్యం కారణంగా కూడా నష్టపరిహారం అందకపోవడాన్ని వారు ఆరోపించారు. అఖిలపక్షాలు అందరినీ కలుపుకొని మత్స్యకారులకు అండగా ఉండి నష్టపరిహారం అందేటట్టు పోరాటం చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుత్తుల గోవింద జయ రామారావు, బిజెపి పార్టీ ప్రెసిడెంట్ కనకాల రాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్లాడి సత్తిబాబు, మల్లాడి బీరస్వామి, బిఎస్‌పి నాయకులు ధూళిపూడి మధు, శ్రీమంతుల శ్రీధర్, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు కొండమూరి హరి, దవులూరి పతి, ఆరిశెట్టి రాజేష్, ప్రెస్సింగి రాంబాబు, దుగ్గుదుర్తి అనిత పాల్గొన్నారు.

యానాం పోలీసులకు బదిలీలు

ప్రజాశక్తి - యానాం

పార్లమెంటు ఎన్నికల షెడ్యూల్ త్వరలో ప్రకటించనున్న నేపథ్యంలో పుదుచ్చేరి పోలీసుశాఖ బదిలీల ప్రక్రియ తాజాగా చేపట్టింది. ఆరుగురు సిఐలు, 59 మంది ఎస్ఐలు, 117 మంది హెచ్‌సిలు, 320 మంది కానిస్టేబుళ్లను బదిలీ చేశారు. యానాం లా అండ్ ఆర్డర్ ఎస్ఐగా జె.మురుగానందం, ట్రాఫిక్ ఎస్ఐగా శేరు నూకరాజును నియమించారు. సిసిఆర్ సెల్ ఎస్ఐ కట్టా సుబ్బరాజు, పుదుచ్చేరి సిసిఆర్ విభాగానికి, పువ్వల వీరభద్ర స్వామిని పుదుచ్చేరి తూర్పు ట్రాఫిక్ విభాగానికి తక్షణమే బదిలీ చేస్తూ ఎస్పి సుభం ఘోష్ ఆదేశాలు జారీ చేశారు. యానాంలో ముగ్గురు హెచ్‌సిలు, తొమ్మిది మంది కానిస్టేబుళ్లను బదిలీ చేశారు.

యానాం నూతన ఎస్‌పిగా రాజశేఖరన్

యానాం నూతన ఎస్‌పిగా రాజశేఖరన్‌ను నియమిస్తూ అండర్ సెక్రెటరీ హారన్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు యానాం ఎస్‌పిగా పని చేసిన రఘునాయుగం పుదుచ్చేరిలోని స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ అయ్యారు.

మున్సిపల్ ఉద్యోగుల కార్యవర్గం ఎన్నిక

యానాం మున్సిపాలిటీ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. ప్రెసిడెంట్‌గా పెనుబోతు కృష్ణ, వైస్ ప్రెసిడెంట్‌గా కర్రి రాంబాబు, సెక్రటరీగా చెల్లి గోపీనాథ్, జాయింట్ సెక్రటరీగా అత్తిలి గోవిందరాజు, ట్రెజరర్‌గా వి.తేజ కిరణ్మయి, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా వి.వీర కుమార్, యనమదల రాంబాబు, దంగేటి చిన వెంకన్న, ఎన్‌డి.ప్రసన్నకుమార్‌ను ఎన్నుకున్నారని సెక్రటరీ చెల్లి గోపీనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు.


ప్రజలతో మాట్లాడుతున్న యనమల దివ్య

జగన్‌ను సాగనంపండి : దివ్య

ప్రజాశక్తి-కోటనందూరు

సిఎం వైఎస్.జగన్‌ను సాగనంపాలని టిడిపి తుని నియోజకవర్గ ఇన్‌ఛార్జి యనమల దివ్య అన్నారు. గురువారం తుని రూరల్ సీతయ్యపేటలో మీ ఇంటికి మీ దివ్య కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా దివ్య మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జగన్ను ఓడించడానికిగా ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. చంద్రబాబు పాలన రాష్ట్రానికి ఎంతో అవసరమని, రాష్ట్రాన్ని అప్పుల ఊపులోకి నెట్టేసి అధోగతి పాలు చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో యనమల శివరామ కృష్ణన్, పొల్నాటి శేషగిరి, మోత్కూరి వెంకటేష్, యనమల భాస్కర్, అప్పన రమేష్, జనసేన సమన్వయకర్త చోడిశెట్టి గణేష్, వంగలపూడి బుజ్జి, చింతంనీడి అబ్బాయి, యాదాల లోవకృష్ణ, గొర్ల తాతబాబు, వీపు అప్పారావు, గొర్ల బాబ్జీ, బొట్టా దేవుళ్లు, కోన బుజ్జి, పల్లా ఈశ్వర, మిరియాల సత్తిబాబు, పంపనబోయిన బాబ్జి, దార్ల శ్రీను, సారిపిల్లి గోవిందు, బంధం వెంకటరమణ పాల్గొన్నారు.

సమస్యలపై నిర్మాణ కార్మికుల వినతి

ప్రజాశక్తి-పిఠాపురం

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్ క్లెయిములు విడుదల చేసి సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని భవన నిర్మాణ, కార్పెంటర్ల సంఘం ఆధ్వర్యంలో గురువారం తహశీల్దార్ పి.త్రినాథరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు కె.చిన్న మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకి తీవ్ర అన్యాయం చేసిందన్నారు. సంక్షేమ బోర్డు నిధులు ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలకు మళ్లించారన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సంక్షేమ బోర్డు నిధులు భవన నిర్మాణ కార్మికులకి ఖర్చు చేయాలని ఉన్న ఆ తీర్పును లెక్కచేయక వైసిపి ప్రభుత్వం కార్మికులకు పెండింగ్ క్లెయిములు పరిహారాలు ఇవ్వకుండా మొండి వైఖరి అవలంబిస్తోందన్నారు. పి.చిరంజీవి, మోహనాచార్యులు, ఎం.సత్తిబాబు, కిరణ్ కుమార్, బ్రహ్మాజీ, అర్జున్ రావు, సతీష్, శ్రీను పాల్గొన్నారు.


వినతిపత్రం ఇస్తున్న నాయకులు, కార్మికులు

50 వేల టీచర్ పోస్టులు భర్తీ చేయాలి

పెద్దాపురం : గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు 50 వేల ఉపాధ్యాయ పోస్టులను ప్రభుత్వం వెంటనే భర్తీ చేయాలని ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎన్.ఫిలిప్‌రాజు, ఎన్ శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎన్నికల సందర్భంగా అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ పోస్టులు భర్తీ చేస్తానని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రకటించారన్నారు. ఇప్పుడు 6 వేలు పోస్టులు మాత్రమే భర్తీ చేస్తానని, వారికి రెండేళ్ల పాటు అప్రెంటిస్ విధానంలో నెలకు రూ.1200, రూ.1500 మాత్రమే జీతాలు ఇచ్చి వెట్టి చాకిరీ చేయిస్తామని ప్రకటించడం పట్ల వారు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

కల్పనా చావ్లాకు నివాళి

ప్రజాశక్తి - తాళ్లపూడి



భారతదేశ మొట్టమొదటి మహిళా అంతరిక్ష యాత్రికురాలిగా గుర్తింపు పొందిన కల్పనా చావ్లా జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు అంతరిక్షయానం పట్ల ఆసక్తితో చదువులు కొనసాగించాలని రాగోలపల్లి ఎంపిపి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దున్నా దుర్గారావు అన్నారు. గురువారం చావ్లా వర్తంతి సందర్భంగా పాఠశాలలో ఆమె చిత్రపటానికి పూలమాలవేసి ఉపాధ్యాయులు విద్యార్థులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కల్పనా చావ్లా జీవిత విశేషాలను ప్రధాన ఉపాధ్యాయుడు విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులతో పాటు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

వెల్ఫేర్ స్టాంపుల రద్దుపై న్యాయవాదుల హర్షం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

వెల్ఫేర్ రూ.20 స్టాంపుల రద్దు చేస్తూ కేబినేట్‌లో నిర్ణయం చేయడంపై న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. వైసిపి లీగల్ ఆధ్వర్యంలో స్వీట్లు పంచారు. వైసిపి లీగల్ సెల్ అధ్యక్షులు, కార్యదర్శి, రీజినల్ కో ఆర్డినేటర్లు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా డివివి.త్రినాథ్, పివివిఎస్‌బి.రాజు, ఎస్ఎం.సాధిక్‌హస్సన్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ప్రెసిడెంట్ సుమన్ పాల్, రూపా రాజేశ్వరి, చెరుకూరి రామారావుచౌదరి, ఎస్.నాగేశ్వరావు, అల్లంపల్లి రామకృష్ణ, పిల్లి నాగినిరమ్య, కప్పల శ్రీను, వై.ఆశోక్ తదితరులు పాల్గొన్నారు

కబడ్డీలో ఫైనల్స్‌కు 'చిక్కాల' జట్టు

ప్రజాశక్తి - చాగల్లు

ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి కబడ్డీ పోటీల్లో కొవ్వూరు నియోకవర్గం నుంచి చిక్కాల జట్టు ఫైనల్స్‌కు చేరింది. రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో గురువారం జరిగిన కబడ్డీ సెమీఫైనల్స్‌లో గోపాలపురం నియోజకవర్గానికి చెందిన జగన్నాథపురం జట్టుపై చిక్కాల జట్టు విజయం సాధించింది. ఈ సందర్భంగా జట్టును ఎంపిడిఒ పాతూరు నిర్మల కుమారి తెలిపారు

నేలటూరులో రైతు సదస్సు

ప్రజాశక్తి - చాగల్లు

వెంకటరమణగూడెం డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉద్యాన కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో గురువారం నేలటూరు సీతారామ కళ్యాణ మండపంలో రైతు సదస్సు నిర్వహించారు. నేలటూరు, కలవలపల్లి గ్రామాల్లో మూడు నెలలుగా వారు క్షేత్రస్థాయిలో పర్యటించి పంటల గురించి తెలుసుకుంటున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రిన్సిపల్ డాక్టర్ ఎం మాధవి హాజరై మాట్లాడారు. గ్రామీణ పని అనుభవం కార్యక్రమం విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఇక్కడ రైతులు కొత్త వంగడాలను సాగుచేస్తుంటారన్నారు. సేంద్రియ సాగుపైనా అవగాహన కలిగి ఉంటారన్నారు. దీని వల్ల విద్యార్థులు పలు విషయాలను తెలుసుకునే వీలుంటుందన్నారు. డాక్టర్ జి.రామానందం గ్రామీణ పని అనుభవం కార్యక్రమం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జి.రామనాథం, సర్పంచ్ యడ్లపల్లి ఉమారజిని, రైతులు అచ్యుతరామారావు, మురళి, కె.వెంకటేశ్వరరావు కొవ్వూరు ఉజ్వల పరిశోధన స్థానం అధికారులు పాల్గొన్నారు

'సిద్ధం' సభ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం రూరల్


వైఎస్‌ఆర్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

ఏలూరులో జరిగే సిద్ధం సభను జయప్రదం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. రాజమహేంద్రవరం రూరల్ ధవళేశ్వరం గ్రామంలోని బ్యారేజీ సెంటర్ వద్ద ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎపి కాపు కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ ముద్దాల అను ఆధ్వర్యంలో ట్రేడ్ యూనియన్ సభ్యుల ఆత్మీయ సమావేశం గురువార జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎపి స్టేట్ ఫైబర్ గ్రిడ్ కార్పొరేషన్ చైర్మన్ గౌతమ రెడ్డి పాల్గొని మాట్లాడారు. ఎన్ని దుష్ట శక్తులు కలిసి వచ్చినా గెలుపు మాత్రం వైసిపిదే అన్నారు. ఈ సందర్భంగా డిసిసిబి చైర్మన్ ఆకుల వీర్రాజుతో కలిసి బ్యారేజి సెంటర్ వద్ద గల వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ రాష్ట్ర నాయకులు అడపా వెంకటరమణ, నాయకులు ముత్యాల పోసికుమార్, బి.కామేశ్వరరావు, త్యాగరాజు, కుమార్, సమీరా, రవి, గంగాచలం వైసిపి రూరల్ ప్రధాన కార్యదర్శి శ్రీరంగం బాలరాజు పాల్గొన్నారు.

'జియోన్' విద్యార్థులకు పునరావాసం కల్పించాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం



జియోన్ అంధ, వికలాంగుల పాఠశాల పట్ల అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు వ్యవహరించిన తీరు చాలా దారుణంగా ఉందని టిడిపి మైనార్టీ సాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ సుభాన్ ఆవేదన వ్యక్తం చేశారు. కోటిపల్లి బస్టాండ్ వద్దనున్న ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో తాత్కాలిక ఆశ్రయంలో ఉన్న జియోన్ అంధ విద్యార్థులను ఆయన పరామర్శించారు. వారికి దుస్తులు అందించారు. టిడిపి మైనార్టీ సెల్ నాయకులను నైట్ డ్రెస్‌లు అడిగారని, ఈ మేరకు వాటిని సమకూర్చామని తెలిపారు. పిల్లలను బలవంతంగా తరలించే సమయంలో దాడి కూడా చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. తక్షణం ప్రభుత్వం స్పందించి వారికి మంచి భవనంలో పునరావాసం, మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నగర మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ అహ్మద్,లాల్ ఖాన్, షేక్ కాశిం, సయ్యద్ ఉమర్,అఫ్సరీ, మహబూబ్ ఖాన్, టిడిపి సీనియర్ నాయకులు ఎమ్‌డి.ఫయాజ్ రెహ్మాన్, నాయకులు సానా దుర్గా ప్రసాద్, బంగారు రాజు, ఫయాజ్, బషీర్ పాల్గొన్నారు.